## షాద్‌నగర్‌లో గుట్కా ప్యాకెట్లు పట్టివేత


పట్టుబడిన గుట్కా, తంబాకులను చూపిస్తున్న పోలీసుల

షాద్‌నగర్, మే 28, (ప్రభాతవార్త): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుట్కా ప్యాకెట్లను నిషేధించడంతో మంగళవారం షాద్‌నగర్‌లో సీఐ ప్రతాపలింగం ఆధ్వర్యంలో రైడ్ నిర్వహించి గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో మొత్తం రెండు లక్షల విలువ గల గుట్కా, తంబాకు ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎవరైనా గుట్కా, తంబాకు లాంటివి విక్రయిస్తూ చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. స్వాధీనం చేసుకున్న గుట్కా, తంబాకులను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
# వార్త


## సోనియాగాంధీ రుణం తీర్చుకునే బాధ్యత తెలంగాణ ప్రజలది : ఎమ్మెల్యే శంకర్

నదిగామ, మే 28, (ప్రభాతవార్త) తెలంగాణ తల్లుల కడుపు కోత ఆపాలని వారి పిల్లలు బాగుండాలని తెలంగాణలోని ప్రజలు ఆశలు ఆశయాలు నెరవేర్చి రాష్ట్రం లోని 80శాతం మంది బడుగు బలహీన వర్గాల ప్రజల బతుకులు బాగుపడాలని రాహుల్‌గాంధీ రాజకీయ భవిష్యత్తును పక్కనపెట్టి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత సోనియా గాంధీకే దక్కుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ స్పష్టం చేశారు. వచ్చే నెల రెండవ తేదీ రాష్ట్రఅవతరణ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న ఉద్యమకారులను గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు నిధులు నియామకాలు లాంటి ఎన్నో ఆశయాలతో తెలంగాణ సాధించుకుంటే మాజీ సిఎం కేసిఆర్ దొంగల పాలు చేశారని రాష్ట్రాన్ని ల్యాండ్ మాఫియా ఇసుక లిక్కర్ చేనేత మాఫీయలు కొనసాగాయని గత బిఆర్‌ఎస్ పాలనపై ధ్వజమెత్తారు. బిఆర్‌ఎస్ సర్కార్లుఓ కేసిఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కాదది రాష్ట్ర ప్రజల పాలిట శనేశ్వరంగా తయారయిందని ఆరోపించారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ కేంద్రంలో బిజెపి ఒకటేనన్నారు. వచ్చేనెల రెండో తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా ఉద్యమకారులను గౌరవించి సోనియా గాంధీ రుణం తీర్చుకుందాం అన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, తదితరులు

## కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు


**సిఇఓ వికాస్‌రాజ్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, మే 28 ప్రభాతవార్త** : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా చేపట్టాల్సిన చర్యల గురించి సీఈవో సూచనలు చేశారు. మలి విడుత ర్యాండమైజేషన్ జరిపి, ఆ జాబితాను అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బందిని కేటాయించాలని అన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటల వరకు అందరూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు చేరుకునేలా చూడాలని, ఈ మేరకు అభ్యర్థులు, వారి తరుపున హాజరయ్యే ఏజెంట్లకు కూడా సమాచారం అందించాలని సూచించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యేలా ఏర్పాట్లు పూరినత చేసుకోవాలని, మొదటగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ప్రారంబించాలని తెలిపారు. ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన అన్ని సదుపాయాలు కౌంటింగ్ సెంటర్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని, జనరేటర్‌ను సైతం అందుబాటులో ఉంచాలని సూచించారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకులు మినహా ఇతరులు ఎవరూ కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు, అవసరమైన పక్షంలో రీకౌంటింగ్ నిర్వహణ గురించి సిబ్బందికి శిక్షణ తరగతుల సందర్భంగా స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకరంగా, సాఫీగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పంపించాలని, రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించే సమయంలో తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు జరగాలని, కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. తుది ఫలితాల వెల్లడి తరువాత కౌంటింగ్ సెంటర్ వద్ద పక్కాగా ఆంక్షలు అమలయ్యేలా చూడాలని, పూర్తి స్థాయిలో నిబంధనలకు లోబడి సంబరాలు నిర్వహించుకునేందుకు మాత్రమే అనుమతించాలని అన్నారు. ఎలాంటి అనుమతులు, వివాదాలు, గందరగోళానికి తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, చేవెళ్ల డిసిపి శ్రీనివాస్ రెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కె.శశాంక వెల్లడి**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, మే 28 ప్రభాతవార్త : వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక అధికారులను ఆదేశించారు. రాబోవు వర్షాకాలం దృష్ట్యా జల్‌పల్లి మున్సిపాలిటి పరిధిలోని ఉస్మాన్ నగర్ కాలనీని మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఉస్మాన్ నగర్ ప్రజలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక జల్‌పల్లి, బడంగ్‌పేట్ మున్సిపల్ కమీషనర్లు, తహసీల్దారులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గతంలో 2020 సంవత్సరంలో బూరాన్ ఖాన్ చెరువు పరిసరా ప్రాంతంలో ముంపునకు గురైన ప్రాంతాల్ని దృష్టిలో పెట్టుకుని రాబోవు వర్షాకాలంలో బూరాన్ ఖాన్ చెరువుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. చెరువులో గుర్రపుడెక్కను, నాచును తొలగించాలని, చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలని తెలిపారు. అధికారులు ముందస్తు కార్యాచరణ, ప్రణాళికను తయారు చేసుకుని అక్కడి ప్రజలకు వర్షాకాలంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ, దోమల బెడద, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జల్ పల్లి, బడంగ్‌పేట మున్సిపల్ కమీషనర్లు, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె.శశాంక, తదితరులు

# పంచాయతీ ఎన్నికల కోసం ఆశావహుల ఎదురుచూపులు

**గ్రామపంచాయతీల్లో కొనసాగుతున్న స్పెషల్ ఆఫీసర్ల పాలన రిజర్వేషన్లపై అందరిలోనూ ఉత్కంఠ..?**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 28, ప్రభాతవార్త**

స్థానిక సంస్థల (గ్రామపంచాయతీల) ఎన్నికల కోసం రాజకీయ పార్టీలకు చెందిన పలువురు ఆశావహులు ఎదురు చూస్తున్నారు. సర్పంచు, ఉపసర్పంచు, వార్డుసభ్యులు ఐదేళ్ల పదవీకాలం గత ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. దీంతో నాటి నుంచి గ్రామపంచాయతీల్లో (గ్రామాల్లో) స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతూ ఉంది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 61 గ్రామపంచాయతీలు, 596వార్డులు ఉన్నాయి. త్వరలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నందున పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సంబంధిత అధికారులు ఇప్పటికే తగు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. అయితే గ్రామాల్లో మాత్రం సర్పంచు పదవికి పోటీ చేయటానికి పలువురు రాజకీయ నాయకులు ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అయితే ఇక గ్రామపంచాయతీలకు సర్పంచు పదవిలకు రిజర్వేషన్లు మారుతాయా లేదా అనేది అందరిలో ఉత్కంఠత కొనసాగుతుంది. అయితే 2018స్థానిక సంస్థల చట్టం ప్రకారం మాత్రం గత రిజర్వేషన్లు మరో ఐదేళ్ల పాటు కొనసాగటం జరుగుతుందని సంబంధిత అధికారగణం మాత్రం పేర్కొంటుంది. గ్రామపంచాయతీల రిజర్వేషన్లు మారవచ్చని మాత్రం రాజకీయ నాయకుల్లో చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం చట్టం తెచ్చినందున, దానిని కాంగ్రెస్ ప్రభుత్వం చట్ట సవరణలకు చర్యలు చేపట్టవచ్చని కూడ చర్చలు జరుగుతున్నాయి. ఈ రిజర్వేషన్ల విషయం మాత్రం చర్చనీయాంశంగ మారి పలువురు రాజకీయ నాయకులు ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. రెండు దఫాలుగ ఒకే రిజర్వేషన్లు కొనసాగేలా 2018లో స్థానిక సంస్థల చట్టం తెచ్చినందున ఈ సారి రిజర్వేషన్ల మార్పునకు సాధ్యం అవుతుందా లేదా అనేది రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బట్టి ఆధారపడి ఉంటుందని పలువురు భావిస్తున్నారు. గత ఐదు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరగటం, ఈ నెలలో ఎంపి ఎన్నికలు పూర్తి జరగటంతో ఇక వచ్చేది గ్రామపంచాయతీ ఎన్నికలు మాత్రమేనని, ఆ తరువాత వచ్చేవి ఎంపిటిసి, ఎంపిపి, జడ్పీటిసి ఎన్నికలు అని చెప్పవచ్చు. గ్రామపంచాయతీ ఎన్నికల కోసం ప్రతి గ్రామం లో


గ్రామపంచాయతీ భవనం

కొందరు రాజకీయ నాయకులు, యువకులు కూడ పోటీ చేయటానికి ఆసక్తిని చూపుతున్నారు. జూన్ 4న ఎంపి ఎన్నికల ఫలితాల వెలువడనున్నందున ఇక జూన్ నెలాఖరులో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పలు వురు భావిస్తున్నారు. జులై నెలలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగవచ్చని అందరు భావిస్తున్నారు. చాలా గ్రా మాల్లో సర్పంచు పదవి రిజర్వేషన్లు ఎలా ఉంటాయనే దానిపైనే వేచి చూస్తునే పోటీ చేయటానికి ఆశావహులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండటానికి సర్పంచు పదవికి పోటీ చేసే ఆశావహులు నూతన ఒరవడిని చూపుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా, సేవలు అందించేలా.. పనులు చేసేలా రాజకీయ నాయకులుగా పలువురు ఆశావ హులు రాణిస్తున్నట్లు చెప్పవచ్చు. గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించటానికి స్థానిక సంస్థల ఎన్నికల సంఘం నుంచి సమాచారం రావచ్చని దీని కోసం సంబం ధిత అధికారులు సిద్ధం అవుతున్నట్లు చెప్పవచ్చు. ఇక అందరి దృష్టి సర్పంచు పదవికి రిజర్వేషన్లు ఎలా ఉంటాయనే విషయం పైనే సందిగ్ధత నెలకొందని చెప్పవచ్చు. గ్రామాల్లో మాత్రం స్థానిక రాజకీయ వేడి కొనసాగుతుంది. అసెంబ్లీ, ఎంపి ఎన్నికలు రాజకీయ నాయకులకు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగ కలిసి వచ్చినట్లు చెప్పవచ్చు. పార్టీ గుర్తులు లేకుండ పార్టీలకు అతీతంగ స్వతంత్ర గుర్తులతో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగనున్నప్పటికీ ప్రధానంగ కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు, వామపక్ష పార్టీల నాయకులు, పలువురు యువకులు కూడ పంచాయతీ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నట్లు స్పష్టం అవుతుంది. ఇప్పటికే గ్రామాల్లో రాజకీయ వేడి కొనసాగుతున్నప్పటికీ ఇక పంచా యతీ వేడి కూడ కొనసాగుతున్నట్లు పరిస్థితిని బట్టి స్పష్టం అవుతుంది.

# కౌంటింగ్ విధివిధానాలపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ

**కలెక్టర్ నారాయణరెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త : ఎన్నికల కౌంటింగ్ నిర్వహణలో ఏ చిన్న పొరపాటు జరుగకుండా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్లు ,కౌంటింగ్ కేంద్రంలో జాగ్రత్తగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం ఐడిఓసి సమావేశంలో కౌంటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్ సూపర్‌వైజర్‌లు కౌంటింగ్ రోజున చేపట్టే విధివిధానాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడినడ మాట్లాడుతూ...కౌంటింగ్ ప్రక్రియలో ఎన్నికల నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఏ చిన్న పొరపాటు జరగకుండా మెక్రో అబ్జర్వర్‌లు, కౌంటింగ్ సూపర్‌వైజర్ విధులు నిర్వహించాలని సూచించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో కౌంటింగ్ ప్రక్రియ టీం వారీగా చేయాల్సి ఉంటుందని, ఆర్ఓల దగ్గర ఆర్డర్ కాపీ, ఐడి కార్డు తీసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ రోజుల ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు స్టార్ట్ చేయాలని, తదుపరి 8 : 30కి ఈవీఎం కౌంటింగ్ ప్రారంభం చేయాలని తెలిపారు. ప్రతి రౌండ్‌కు రిజల్ట్ షీట్‌లో రాసి, రిసల్ట్ ఇవ్వాలని అన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు కంట్రోల్ యూనిట్ ఆయా పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించినదా కాదా అని చెక్ చేసుకో వాలని, ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది పాల్గొంటారు. కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్ స్విచ్ ఆన్ చేసి, కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17 సి నందు నమోదైన ఓట్లు సరిచూసుకోవాలని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలకు చోటు లేకుండా ఎన్నికల విధులను సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్, ఆర్‌డిఓ వాసు చంద్ర, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్స్ రాంరెడ్డి, వీర కాంతం, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది, పాల్గొన్నారు.


అంగడి చిట్టంపల్లిలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

**పూడూరు, మే 28, ప్రభాతవార్త :** జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహాకారసంఘం అద్వర్యంలో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు ఉన్నతాధికారులతో చర్చించి ముగిసిన కొనుగోలు కేంద్రం వ్యవధిని వారంరోజుపాటు పొడిగించామని వివరించారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం క్వింటాలు జొన్నలకు రూ.3180గా మద్దత్తు ధరను నిర్ణయించిందని వివరించారు. ఇట్టి సదవకాశాన్ని ప్రతిఒక్కరైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న శివాలయం వార్షికోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించినన పార్వతీ పరమేశ్వరులకళ్యాణం కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పి సతీష్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు కడుమూరు ఆనందం, పటోళ్ల రఘునాథ్‌రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటయ్య, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు సురేందర్, పిఎసిఎస్ డైరెక్టర్ చెన్నయ్య, గ్రామస్తులు రవి, అమర్నాథ్, వితలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిటిసి వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేయాలి

**ఐదేళ్లలో ఎంపిటిసిలుగా ఏమి అభివృద్ధి చేయ లేకపోయాం పవర్ లేదు..పనిలేదు..విలువలు లేవు,.నిధులు లేవు ఎంపిపి వి.హారికమురళీగౌడ్**

**శామీర్‌పేట, మే 28, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఎంపిటిసి వ్యవస్థను రద్దు చేయాలని, ఈ ఐదేళ్లలో ఎంపిటిసిలుగా గ్రామాల్లో ఏమి అభివృద్ధి చేయలేక పోయామని మూడుచింతలపల్లి మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు జి. హన్మంత్‌రెడ్డి, మండల వైస్‌ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డిలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపిటిసిలకు పవర్ లేదు..పనిలేదు..విలువలు లేవు,.నిధులు లేవు ..బాధ్యతలు లేవని..కనీసం కుర్చీ కూడ లేదని, గ్రామపంచాయతీలోనూ ఆ పదవికి విలువ లేదని ఎంపిటిసిల వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసి ఇక ముందు ఎంపిపి పదవికి ప్రత్యక్ష (డైరక్ట్) ఎన్నిక నిర్వహించాలని వారు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల పాటు ఎంపిటిసిలుగా కొనసాగుతూ నిధులు లేక, బాధ్యతలు లేక ఇబ్బందులు పడ్డామని, గ్రామపంచాయతీల్లోనూ విలువలు లేకున్నా కొనసాగామని ఒక ముందు కూడ ఎంపిటిసిలుగా ఎవరు పోటీ చేయటానికి ముందుకు రావద్దని వారు అన్నారు. వచ్చె జూలై 4వ తేదీతో ఎంపిటిసి, ఎంపిపి, జడ్పీటిసిల ఐదేళ్ల పదవీ కాలం ముగుస్తున్నందున వారు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్లలో మూడుచింతలపల్లి మండల పరిషత్ చివరి సర్వ సభ్య సమావేశం అని ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు కూడ పేర్కొనటంతో ఈ విషయం చర్చనీయాంశంగ మారింది. ..మంగళవారం మూడు చింతలపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి వి.హారికమురళీగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై ఎజెండా వారిగ సభ కొనసాగింది. గృహజ్యోతి పథకం కింద 200యూనిట్స్ ఉచిత విద్యుత్‌ను సుమారు 5వేల మంది వరకు పొందుతున్నారని, దీనికి సంబంధించి ప్రభుత్వం సుమారు 23లక్షల రూపాయల వరకు చెల్లించిందని ఎఇ శ్రీనివాస్ పేర్కొన్నారు. కొందరికి బిల్లులు వస్తున్నాయని ఉచిత విద్యుత్‌ను పొందలేకపోతున్నారని సవరించాలని వైస్‌ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు జి.హన్మంతరెడ్డిలు సూచించారు. ఎన్నికల కోడ్ పూర్తి తరువాత సవరించటానికి అవకాశం ఉంటుందని, లక్ష్మాపూర్‌లో విద్యుత్ సరిగ్గా ఉండటం లేదని ఎంపిటిసి నాగరాజు పేర్కొనగా నిబంధనల ప్రకారం విద్యుత్ సరఫరా జరుగుతుందని, ఈదురు గాలులు వీచినపుడు మాత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. కేశవరం పరిధిలో హరితహారం చెట్టును కొమ్మల తొలగింపు పేరుతో విద్యుత్ వారు నరికివేయటం ఎంత వరకు సబబు అని, కొమ్మలు తొలగించకుండ చెట్టును నరకటం సరికాదని నరికిన చెట్టు ఫోటోను సభలో చూపటం జరిగింది. చెట్టు నరకటం సరికాదని, చర్యలు తీసుకోవాలని కేవవరం ఎంపిటిసి జి.హన్మంతరెడ్డి అన్నారు. అలా జరిగితే పరిశీలిస్తానని, ఇలా జరిగితే గతంలోనూ ఫారెస్ట్ వారికి జరిమాన చెల్లించినట్లు కేశవరంను సందర్శించి నరికిన చెట్టు ఉంటే పరిశీలిస్తానని సిబ్బంది అక్కడే ఉన్నారని తెలుసుకుంటానని ఎఇ శ్రీనివాస్ అన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టటానికి ప్రతి గ్రామానికి 5ఫామ్ పండ్స్, హార్టికల్చర్, ఫిశ్ ఫండ్


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వి.హారికమురళీగౌడ్, పాల్గొన్న వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ వత్సలదేవి, తహసీల్దార్ వెంకటనర్సింహ్మారెడ్డి, ఎంపిటిసిలు, కోఆప్షన్‌సభ్యులు, అధికారులు

(చెరువులవద్ద) పలు పనులు చేపట్టటం జరుగుతుందని పనులను గుర్తించి పంపాలని సంబంధిత అధికారి సూర్య సూచించటం జరిగింది. దీనికి ఎంపిడిఓ వత్సలదేవి స్పందిస్తూ గ్రామపంచాయతీ కార్యదర్శులకు గత వారం రోజుల నుంచి పనులను గుర్తించాలని చెబుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని వెంటనే పనుల వివరాలను అందరు పంపాలని ఆదేశించారు. ఎంసిపల్లిలో ఇరిగేషన్ పరిధిలో ప్రైవేట్ వారు బ్రిడ్జిల నిర్మాణాలు చేపడుతున్నారని చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి పి.నాగరాజు ఇరిగేషన్ ఎఇకి సూచించగ పరిశీలిస్తానని ఆమె అన్నారు. లక్ష్మాపూర్‌లో ఇంకా కొందరికి పట్టాదారు పాసుబుక్కులు రాక ఇబ్బందులు పడుతున్నారని ఎంపిటిసి పి.నాగరాజు తహసీల్దార్ వెంకటనర్సింహ్మారెడ్డి దృష్టికి తీసుకరావటంతో పరిశీలిస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కాకముందే పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, మరమ్మతు పనులు ఉంటే వెంటనే చేపట్టాలని ఇటీవల కలెక్టర్ కూడ సందర్శించి పరిశీలించటం జరిగిందని ఎంపిటిసి హన్మంతరెడ్డి పిఆర్ ఎఇకి సూచించారు. త్రాగునీటి విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపిడిఓ వత్సలదేవి సంబంధిత మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. లక్ష్మాపూర్‌లో నీరు పైప్‌లైన్స్ పుల్ అయి వృధగ వెళుతున్నాయని ఎంపిటిసి నాగరాజు అనటంతో పరిశీలిస్తామని మిషన్‌భగీరథ అధికారులు అన్నారు. ఈ సందర్భంగ ఎంపిపి వి.హారికమురళీగౌడ్ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ఎంసిపల్లి మండల అభివృద్ధికి ఎంతో కృషి చేయటం జరిగిందని, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు అందరు కూడ సహకరించారని అందరికి దన్యవాదాలు తెలిపారు. ఐదేళ్ల పదవీకాలం జూలై 4వ తేదీతో ముగియనున్నందున ఇదే మండల చివరి సర్వసభ్య సమావేశం అని సహకరించిన అందరికి ఎంపిపి వి.హారికమురళీగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల పాటు సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు, సిబ్బందికి అందరికి వైస్‌ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసిల అధ్యక్షులు జి.హన్మంతరెడ్డిలు దన్యవాదాలు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో వారితో పాటు ఎంపిటిసి అఖిలేశ్‌రెడ్డి, మండల కోఆప్షన్ గౌస్‌ఫాష, పలు శాఖల మండల అధికారులు, సిబ్బంది, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించాలి

**జిల్లా వ్యవసాయ అధికారి మేరీ రేఖ**


నూతన్‌కల్ గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సు

**మేడ్చల్, మే 28. ప్రభాతవార్త :** పంటసాగులో అధిక దిగుబడుల కోసం రైతుల మేలురకాల విత్తనాలను కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మేరీ రేఖ అన్నారు. వానాకాలం పంట సాగు కోసం విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మేడ్చల్ మండలంలోని రాయిలాపూర్, రావల్‌కోల్, మైసిరెడ్డిపల్లి, రావల్‌కోల్, సైదోనిగడ్డ తండాలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు కొనగోలు చేసే సమ యంలో దుకాణం నుంచి రసీదును తీసుకోవాలని, వదులుగా ఉన్న సంచులలోని విత్తనాలను కొనుగోలు చేయరాదని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనాలని, విత్తన ప్యాకెట్, రసీదును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని తెలిపారు. మేలైన విత్తనాలను ఎంపిక చేసుకుని అధికదిగుబడులు సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల వ్యవసాయ అధికారి అర్చన, విస్తర్ణ అధికా రులు సుమిత, తేజశ్వని, రైతులు, నాయకులు పాల్గొన్నారు.


# అన్నదానం అభినందనీయం : డిఎస్పీ బాలకృష్ణారెడ్డి

**తాండూరు, మే 28, ప్రభాతవార్త :** అన్నదానం అభినందనీయమని తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరు సామాజాక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వైశ్య ఫెండరేషన్ తెలంగాణ రాష్ట్ర యూత్ సెక్రెటరీ రొంపల్లి సంతోష్‌కుమార్ ఆద్వర్యంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి సంఘం సంయుక్తంగా దాతల సహాకారంతో పట్టణంలోని చించోళి రోడ్డు మార్గంలోని మల్లప్పమడిగ సమీపంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం 10వ రోజు తాండూరు పట్టణానికి చెందిన కల్వ గీత, రాజశేఖర్ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. నిరుపేదలకు అన్నదానం చేయడం చాలా అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు డిఎస్పీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డిఎస్పీ బాలకృష్ణారెడ్డి

# కోడ్ ముగియగానే ..బదలీలు ..!

-విద్యుత్‌శాఖలో ఏఈ నుంచి సిజిఎంల వరకు భారీగా మార్పులు
-సర్కిల్ వారీగా జాబితా సిద్ధం చేస్తున్న ఉన్నతాధికారులు
-ఫోకల్ స్థానాలు దక్కించుకునేందుకు పలువురు ప్రయత్నాలు
-మంత్రులు, ఉన్నతాధికారులను కలుస్తున్న యూనియన్ నేతలు
-గ్రేటర్‌లోనివారిని జిల్లాలకు ... జిల్లాల నుంచి ఇక్కడికి మార్చే అవకాశం




**హైదరాబాద్, మే 28,ప్రభాతవార్త:**
విద్యుత్‌శాఖలో ఉద్యోగబదిలీల ప్రక్రియపై డిస్కం దృష్టి సారించింది. ఎన్నికల కోడ్ ముగియగానే భారీగా బదిలీలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. డివిజన్, సర్కిల్ వారిగా ఒకే స్థానంలో ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు మూడేళ్ల దాటివారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రేటర్ జోన్‌లోని సైబరసిటీ, మేడ్చల్, రాజేంద్రనగర్, హైదరాబాద్ సౌత్, సెంట్రల్, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో భారీగా ఉద్యోగ బదిలీలు జరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో కొంతమందిఅధికారులు, యూనియన్ నాయకులు తమకు సంబంధించిన ఉద్యోగులకు తాము సూచించిన ప్రాంతాల్లో పోస్టింగులు కల్పించాలంటూ ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు తమకు అనుకూలమైన మంత్రులు, ఉన్నతాధికారులను కలుస్తూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. ముఖ్యంగా ఇప్పటికే ఫోకల్ (ఎక్కువ ఆదాయం) ప్రాంతాల్లో పనిచేస్తున్న యూనియన్ నేతలు అక్కడి నుంచి బదిలీ కాకుండా ఉండేందుకు ప్రభుత్వ పెద్దలను కలుస్తున్నారు. అలాగే ఇప్పటివరకు జీహెచ్ఎంసి పరిధిలో రాజేక పోయిన ఉద్యోగులు, ఇంజనీర్లు ఈప్రభుత్వంలో నైనా ,గ్రేటర్ పరిధిలో పోస్టింగ్ దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. దీంతో మింట్‌కాం పౌండ్‌లోని యూనియన్, అసోషియేషన్ కార్యాలయాల్లో జిల్లాలనుంచి వచ్చే ఉద్యోగులు,నాయకులతో సందడిగా మారుతున్నాయి.

**ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తి..**
నగరంలోని పలు సర్కిళ్లు, డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరుపై ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. ఉద్యోగుల పనితీరు సరిగ్గా లేకుంటే చర్యలు తీసుకుంటామని సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి భట్టివిక్ర మార్క ఇప్పటికే పలుసార్లు హెచ్చరించారు. నిరంత ర విద్యుత్ కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నా గత ప్రభుత్వంతో సత్సంబంధాలు కలిగిన పలువురు ఇంజనీర్లు, యూనియన్ నాయకులు తమ ప్రభుత్వా న్ని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని గుర్తిం చారు. తాము ఎన్నిసార్లు హెచ్చరించినా వారిలో మార్పురాకపోవడంతో ఎలాగైనా వారికి స్థాన చలనం కలిగించాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. డిస్కం లో కొంతమంది అధికారులు ఒకే సర్కిల్, ఒకే డివిజన్‌లో విధులు నిర్వహిస్తూ చక్రం తిప్పుతున్నా రనే విమర్శలు సైతం ఉన్నాయి. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని ఓడివిజన్‌లో గత నెలలో ఓడిఈ పదవి విరమణ చేయగా, ఆస్థానంలో సిజిఎం ఎస్‌ఈ కార్యాలయంలో పనిచేసే అధికారికి ఇన్‌ఛార్జ్ బాధ్య తలు అప్పగించడంపై పలువిమర్శలు వ్యక్తమయ్యా యి. అలాగే రాజేంద్రనగర్, సైబరసిటీ పరిధిలోనూ పలువురు అధికారులు యూనియన్ల అండదండలతో భారీగా అవినీతికి పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**గ్రేటర్‌నుంచి జిల్లాలకు ...అక్కడి నుంచి ఇక్కడికి**
గ్రేటర్‌లో భారీగా బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నా యి. ఉద్యోగుల పనితీరుదృష్టిలో పెట్టుకుని జిల్లాల నుంచి గ్రేటర్కు, గ్రేటర్‌లో పనిచేస్తున్న అధికారుల కు జిల్లాకు బదిలీలు చేసే అవకాశాలు కనిపిస్తు న్నాయి. శివారుప్రాంతాల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారులపై తరుచూ ఫిర్యాదులు అందుతుండటం తో వారిని పూర్తిస్థాయిలో స్థానచలనం చేయాలని సిఎండి భావిస్తున్నారు. అలాగే టిఎస్ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేలా కసరత్తు చేస్తున్నారు. దీంతో ఒఅండ్ఎం సిబ్బంది, సబ్ ఇంజనీర్లు, సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న సూపరిం టెండెంట్ ఇంజనీర్లను ఇతర సర్కిల్ పరిధిలోకిబదిలీలు చేసే అవకాశాలున్నాయి.. అయితే నగరంలో విద్యు త్‌పంపిణీ వ్యవస్థ... గ్రామాల్లో పంపిణీ వ్యవస్థకు తేడా ఉండటంతో ఒక్కసారిగా జిల్లాలనుంచి గ్రేటర్ జోన్‌కు ఉద్యోగులను బదిలీ చేస్తే ఇబ్బందులు తలె త్తే అవకాశాలున్నాయని సీనియర్ అధికారులు తెలు పుతున్నారు. యూనియన్లు, అసోషియేషన్ల ప్రాధా న్యం లేకుండా సీనియారిటీ ఉద్యోగుల పనితీరు ఆధా రంగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

# నగర శివారుల్లో వరుస రియల్‌ఎస్టేట్ మోసాలు

-అమీన్ పురా, బందనకొమ్ము ప్రాంతాల్లో మరోసారి -తెలివి మీరిన అక్రమార్కులు కోట్లు కొల్లగొట్టారు

**హైదరాబాద్, మే27, ప్రభాతవార్త:**
నగరంలో వరుస రియలెస్టేట్ మోసాలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. భూ విక్రయాల్లో వివిధ రకాలుగా మోసాలకు పాల్పడే నేపథ్యంలో, ఇటీవలె జరిగిన ఘటనలో ఏళ్ళనాటి పాత భూముల నిజమైన యజమానులకు బదులు నకిలీ మనుషులను పురమాయించి డూప్లికేట్ ఆధారాలతో ప్లాట్లను విక్రయించి అడ్డదా రిలో దోచుకున్నారు. తాజాగా ఫ్రీలాంచ్ పేరుతో వేల మందిని మోసం చేసి కోట్లు కొల్లగొట్టిన వైనం ఒకే వారంలో రెండు సార్లు చోటు చేసుకుంది. అందు లోని ఒక ఘటనలో ఫ్రీలాంచింగ్ పేరుతో దాదాపు 2వేల మందిని పైగా మోసం చేసి రూ.1,500కోట్లు దోచేసిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ బోర్డు తిప్పేసింది. దాంతో బాధితులు బషీర్‌బాగ్ సీసీఎస్ ఆఫిసు ముందు ఆందోళనకు దిగి తమ గోడు పోలీసులకు వినిపించారు. ఈ భారీ మోసాన్ని నగర ప్రజలు మరువక ముందే, ఆది జరిగిన వారం లోపే మరో ఫ్రీలాంచ్ మోసం వెలుగులోకి వచ్చిం ది. గ్రీన్ మెట్రో ఇన్‌ఫ్రాటెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో బాధితుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన భోగస్ సంస్థ మూడోకంటికి తెలియకుండా మాయ మైంది. వరుసగా జరిగిన ఈ రియలెస్టేట్ మోసాలు నగర శివారుల్లో అమీన్ పురా, బంధన కొమ్ము పరిసరాల్లోనే జరగడం గమనార్హం.

**తెలివిమీరిన అక్రమార్కులు:**
రిజిస్టర్ కార్యాలయం వారి నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని తెలివిమీరిన అక్రమా ర్కులు చాపకింద నీరులా వ్యవహరిస్తూ కోట్లు విలువ చేసే భూములను నకిలీ ఆధారాలతో అమ్మేసిన వైనం ఇటీవలె చోటు చేసుకుంది. తెలంగాణలో భూముల విలువ పెరిగిన నేపథ్యంలో అమీన్ పురా, బందనకొమ్ము, రామేశ్వరం బండ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తించిన అక్రమార్కులు, వాటి యజమా నులు ఎవరో తెలుసుకుని వారి పేరుతో నకిలీ ఆధార్ కార్డులనూ, నకిలీ పత్రాల నూ, నకిలీ వంశస్థులనూ సృష్టించి స్థలాలను కాజేసి డబ్బు చేసుకుంటున్నారు. నగరానికి చెందిన రియలెస్టేట్ వ్యాపారులు బండి దుర్గాప్రసాద్, సుబ్బారావు, రవీ గౌడ్‌లు ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో ఇద్దరు అమీన్‌పురా పోలీస్ స్టేషన్ పరి ధిలో గత 20 నుండి 25 సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ప్లాట్లను రెక్కీ వేసి మరీ గుర్తించి, ఆ భూముల అసల యజమానుల వివరాలను పకడ్బందీగా తెలు సుకున్నారు. అనంతరం ముఠాలో మరొక సభ్యుడికి సమాచారం అందించడంతో అతడు రంగంలోకి దిగి, నకిలీ యజమానితో పాటు నకిలీ వంశస్థులను సిద్ధం చేశాడు. అమాయక ప్రజలకు డబ్బాశ చూపించి, వారిని నకిలీ మనుషులుగా నటించమని చెప్పిన రోజు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చి సంతకాలు చేయాలని ఒప్పించి నియమించారు. అసలు యజమాని పేరు మీద నకిలీ ఆధార్ కార్డు, నకిలీ సేల్ డీడ్, లింక్ డాక్యుమెంట్లను తయారు చేసి ఆ స్థలాలు అమ్ముతూ అడ్డగోలుగా సంపాదించారు. ఒక్కో ప్లాట్ విలువా కోట్లలో ఉంటుందని పోలీసు లు చెబుతున్నారు. ఇలా దాదాపు 15 నుంచి 20 ప్లాట్ల వరకూ ఈ ముఠా అమ్మేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డ పోలీసులు వీరిపై నిఘా వేసి అరెస్ట్ చేశారు.

**తక్కువ ధరకు ప్లాట్ల పేరుతో మోసం:**
ఫ్రీలాంచ్ పేరుతో తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామంటూ దాదాపు 2వేల మందిని మభ్యపెట్టిందో రియలెస్టేట్ సంస్థ. సంగారెడ్డి జిల్లా అమీన్ పురా ప్రాంతంలో సాపితీ శర్వాణీ ఎలైట్ పేరుతో 25 ఎకరాల్లో 32 అంతస్తులతో 10 టవర్లు నిర్మిస్తామని చెప్పి రెండు వేల మంది సామాన్యుల వద్ద సుమారు రూ1,500 కోట్లు వసూలు చేసి మాయమైంది. ఫ్రీలాంచ్ ఆఫర్‌తో తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామని చెప్పడంతో ఎంతో మంది ఎగబడడంతో సంస్థను అడ్డు పెట్టుకున్న అక్రమార్కులు డబ్బులు కట్టించుకుని ఉడాయించారు. ఈ మేరకు బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయం ముందు భారీగా మోహరించిన బాధితులు పోలీసులకు తమ గోడు వెళ్ళగక్కుకున్నారు. నిందితుల ఫొటోలను ప్లకార్డులకూ, ఫ్లెక్సీలకూ ప్రింట్ చేయించి ఆందోళనకుదిగారు. ఆది జరిగిన దాదాపు తక్కువ వ్యవధిలోనే మరో ఫ్రీలాంచ్ మోసం వెలుగులోకి వచ్చింది. గ్రీన్ మెట్రో ఇన్‌ఫ్రాటెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో బాధితుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన భోగస్ సంస్థ మూడోకంటికి తెలియకుండా మాయమైంది. ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయ కుండా సదరు కంపెనీ మోసం చేసిందని సీసీఎస్ ప్రధాన కార్యాలయం ముందు బాధితులు వాపోయారు. ఇటువంటి రియలెస్టేట్ మోసాలు అధికమవ్వడంతో అప్రమత్తమైన పోలీసులు అక్రమార్కులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుం టున్నారు. పోలీసుల ఆదేశాల మేరకు రిజిస్టర్ కార్యాలయ అధికారులు స్థలాల రిజిస్ట్రేషన్ విషయాల్లో అప్రమత్తమయ్యారు.

# హద్దులు దాటిన ఇద్దరి అవినీతి..!

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త :**
విద్యుత్ శాఖ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కందుకూర్, రాజేంద్రనగర్ డీఇ కార్యాలయాలతోపాటు ఏడీఇ, ఏఇల కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. డీఇ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఆ ఇద్దరు అధికారుల అవినీతి, అక్రమ వసూళ్ళు హద్దులు దాటినా ఓ వైపు విజిలెన్స్, అవినీతి నిరోధ క శాఖ (ఏసీబీ) దృష్టి సారించకపోవడంతో తమకు అడ్డే లేదన్న ధీమాతో సదరు అధికారులు మామూళ్ళ కోసం రెచ్చిపోతున్నారు. డీఇ, ఏడీఇ, ఏఇల కార్యాల యాల్లో కొందరు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్, కనెక్షన్లు, ప్యానల్ బోర్డుల స్వీచ్‌గే ర్‌లు, ఎర్త్‌ల మంజూరుకు గాను పెద్దమొత్తంలో మామూళ్ళను వసూలు చేస్తు న్నారు. కనెక్షన్ల ఎస్టిమేషన్లలో కొందరు ఏడీఇలు, ఏఇలు కొందరు కీలక అధికా రులు గోల్‌మాల్ చేసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. కొత్తగా విద్యుత్ కనెక్షన్లు, వ్యాపార, వాణిజ్య కనెక్షన్లు అధికారులకు కాసులు కురిపిస్తు న్నాయి. కొత్తగా విద్యుత్ కనెక్షన్ జారీచేయడంలో జరుగుతున్న అక్రమాలు అంత ఇంతా కావు. ఇక కొత్త కనెక్షన్లకు మరింత గిరాకీ పెరుగుతుంది. అధికా రుల వేదింపులు అంతా ఇంతా కావు. అడిగినంత ఇస్తే తప్ప ఎవరు చెప్పినా కొత్త కనెక్షన్ ఇచ్చే పరిస్థితి లేదంటే చెబుతున్నారు. శివార్లలో బహుళఅంతస్తుల భవనాలతోపాటు వ్యక్తిగత గృహాలు, కమర్షియల్ భవనాలు, విల్లాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. పెద్దఎత్తున వెలుస్తున్న నిర్మాణాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. బహుళ అంతస్తుల భవనాలను బట్టి మామూళ్ళను నిర్ణయిస్తు న్నారు. భవనాలు, అపార్ట్‌మెంట్లలో 4మీటర్లు దాటితే ప్యానల్ బోర్డు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ప్యానల్ బోర్డు లేకున్నా మామూళ్ళు తీసుకుని మీటర్లు కేటాయించేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్యానల్ బోర్డు పేరు చెప్పి విద్యుత్ మీటర్ల జారీలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదా హరణకు ఒక ప్రాంతంలోని ఓ భవనంలో నాలుగుకు మించి మీటర్లు ఉన్నట్లైతే ప్యానల్ బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే వాస్తవానికి ప్యానల్ బోర్డు ఏర్పాటు వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. ప్యానల్ బోర్డు లేకపోవడం వల్ల మీటర్ రీడింగ్ తీసే సిబ్బ ందికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పాటు ప్రమాదాలు జరుగకుండా ఉంటుంది. ఈ నిబంధనల్ని ఖచ్చితంగా అమలు చేస్తే బాగుంటుంది. కాని దీన్ని బూచిగా చూపిస్తూ కొందరు మీటర్ల జారీలో అందినంత దండుకుంటున్నారు. ప్యానల్ బోర్డుల పేరిట కొందరు అధికారులు, సిబ్బంది పెద్ద మొత్తంలో లంచాలను దండుకుంటున్నారు. నాలుగు మీటర్లకు మించితే కనెక్షన్లకు సంబంధించి ప్యానల్ బోర్డు ఏర్పాటు తప్పనిసరి అని పేర్కొంటున్న అధికారులు కొందరికి మాత్రమే ఈ నిబంధనల్ని వర్తింప చేయడం బట్టి చూస్తే కొందరు అధికారులు, సిబ్బంది మామూళ్ళ కోసమే ఈ విధంగా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తుంది. మామూ ళ్ళు ముట్టచెబితే వారికి మాత్రం ఈ నిబంధన వర్తింపచేయడంలేదు. మామూ ళ్ళు ఇవ్వని వారికి మాత్రం ప్యానల్ బోర్డును ఏర్పాటు చేసుకుంటేనే కనెక్షన్ ఇస్తామని చెబుతున్నారు. ఇదిలా ఉండగా డీఇలు, ఏడీఇలు, ఏఇలు తనిఖీలు, సమావేశాల పేరుతో కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి. దీంతో కార్యాలయాలకు వినియోగదారులు వస్తే అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరుసటి రోజు వచ్చిన వారికి అధికా రులు సకాలంలో కలవడానికి సమయం ఇవ్వకపోవడంతో వినియోగదారులకు నిరీక్షణ తప్పడంలేదు. పెరిగిన విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పెరిగిన విద్యుత్ కనెక్షన్లను దృష్టిలో పెట్టుకుని కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా అందు కు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తుడడంతో విద్యుత్ సమస్యలు అంతకం తకు పెరుగుతున్నాయి. ఎంత సేపు వ్యక్తిగత గృహాలు, అపార్ట్‌మెంట్లకు సంబం ధించిన కొత్త కనెక్షన్ల మంజూరులో కొందరు ఏడీఇ, ఏఇలు లంచాలను దండు కుంటూ యమబిజీగా ఉంటూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను పట్టించు కోవడంలేదు. ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఫీడర్లు ట్రిప్పయినా క్షేత్రస్థాయి సిబ్బంది స్పందించకపోవడంతో సరఫరాలో అంతర యాలు ఏర్పడుతున్నాయి. ఇక రాత్రి వేళల్లో కరెంట్ పోయిందంటే సకాలంలో కరెంట్ రావడం లేదు. కరెంట్ సరఫరాలో కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో వినియోగదారులు నిత్యం అనేక అవస్థలకు గురవుతున్నారు. వ్యాపార సముదాయాలకు ఓ విధంగా డొమెస్టిక్ వినియోగదా రులకు మరో విధంగా సరఫరా చేస్తూ విద్యుత్ అధికారులు తమ ద్వందనీతిని ప్రదర్శిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో కరెంట్ హై,లో ఓల్టేజీలతో కరెంట్ సరఫరా అవుతుండడంతో విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. ఇంట్లోని టీవీలు, ల్యాప్‌ట్యాప్‌లు, కంప్యూటర్లు కాలిపోతున్నాయి. అనేక ప్రాం తాల్లో ఎన్నో ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు నేటికి దర్శనమి స్తున్నాయి. ప్రజల ప్రాణాలకు పెను ముప్పుగా మారినప్పటికీ మామూళ్ళపైనే ద్యాస తప్ప ఈ సమస్యను పట్టించు కోవడంలేదని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

**హద్దులు దాటిన ఓ ఇద్దరి అవినీతి..**
రాజేంద్రనగర్, కందుకూర్ డీఇ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఓ ఇద్దరు అధికారులు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. అక్రమ సంపా దనకు అలవాటుపడిన సదరు అధికారులు డీఇ కార్యాలయాల్లో తమ ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో పనిచేసిన ప్రతి చోట కూడా ఇలాగే వ్యవహరించినట్లు సదరు అధికారులపై విమర్శలు ఉన్నాయి. ఫైళ్ళను సకాలంలో క్లియర్ చేయకపోవడంతోపాటు పాలన గాడితప్పినట్లు ఆరో పణలు ఉన్నాయి. కొందరు అధికారులు వినియోగదారులను దోచుకోవడమే త మ విధి అన్నట్లుగా ఇష్టారాజ్యంగా దోచుకకుంటున్నారని బాహాటంగానే విమర్శ లు వినిపి స్తున్నాయి. డీఇ కార్యాలయాలతోపాటు ఏడీఇ, ఏఇ కార్యాలయాల్లో పనిచేసే పై స్థాయి నుంచి కిందిస్థాయి వరకు రూ.కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు వసూలు చేస్తున్న అవినీతి సొమ్మును అంతా కలిసి పంచుకుంటున్నట్లు తెలిసింది. డీఇ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## పరిశుభ్రత పాటించకపోతే ఆరోగ్య సమస్యలు : డాక్టర్ మనోజ్‌రెడ్డి హెచ్చరిక

**సైఫాబాద్, మే 28 ప్రభాతవార్త :**
మహిళలకు ప్రతి నెల వచ్చే పీరియడ్స్ వస్తుంటాయని వాటిపై అవగాహనలేక అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని సుల్తాన్ బజార్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. రుతుక్రమం సగటున 28 రోజులు ఉంటుందని, సాధారణంగా ఐదు రోజులు అవుతుందని, అందుకే ఏడాదిలో ఐదో నెలలోని 28వ రోజు రుతు పరిశుభ్రత దినం గా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రుతుక్రమంలో పరిశుభ్రతను పాటించకపోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు వస్తుం టాయని, ఈస్ట్ ఇన్‌ఫెక్షన్‌ల నుంచి యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్ల వరకు రుతుక్రమ పరిశుభ్రతతో సంబంధం ఉన్న కొన్ని ప్రమాదాలు ఉన్నాయని ఆయన వివరించారు. రుతు పరిశుభ్రతను నిర్వహించడానికి అపరి శుభ్రమైన శానిటరీ ప్యాడ్‌లు, శానిటరీ ప్యాడ్‌లు వివిధ కవర్‌లలో వస్తుంటాయని అందువల్ల మంచివి మాత్రమే వాడాలని, ధర తక్కువగా ఉన్నవాటిని ఎంచుకోరాదని, నాణ్యమైన వాటిని మాత్రమే వినియోగిం చాలని సూచించారు. మహిళలు ప్రతి 6, 8 గంటలకొకసారి ప్యాడ్‌లను మార్చుకొకపోతే శరీరంలో దద్దుర్లు, యోనిలో ఈస్ట్ ఇన్‌ఫెక్షన్‌లకు గురవుతారని హెచ్చరించారు. ప్యాడ్‌లు ధరించే ముందు, ఆ తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు.

## సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలి : టిపిసిసి నేత గోనె సాల్మన్‌రాజ్

**చిక్కడపల్లి, మే 28 ప్రభాతవార్త:**
సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ నేత గోనె సాల్మన్‌రాజ్ అన్నారు. ప్రముఖ సంఘసే వకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గుర్రం శంకర్ అభినం దన సత్కార కార్యక్రమం మంగళవారం జవహరనగర్‌లో కాంగ్రెస్ పార్టీ నేత జానకీ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొ నడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, శ్యామ్ మూదిరాజ్, భాస్కర్‌రెడ్డి, శ్యామ్ మూ దిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ధరల దడ..!



## -మండిపోతున్న కూరగాయలు

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త**
కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కూరగా యల ఉత్పత్తి బాగా తగ్గడంతో కాయగూరల ధరలు మండుతున్నాయి. మార్కెట్‌లో కూరగాయలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. రైతు బజార్లు, వారాంతపు సంత, కూరగాయల మార్కెట్.. ఎక్కడ చూసినా ధరల మోతే. ఏ కూర గాయ చూసినా పావుకేజీ ధర రూ.20లు నుంచి రూ. 25లు పలుకుతోంది. సాగు నీరు అందుబా టులో ఉన్న రోజుల్లో కిలో కూరగాయలు రూ.20 లు నుంచి రూ.40లు వరకు లభించేవి. ప్రస్తుత హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20లు నుంచి రూ.25 లు వరకు ధర పలుకుతుండగా వారాంతపు సంత ల్లో కిలో రూ.60లు-రూ120లు పలుకుతున్నాయి.

నగరంలో సుమారు 1.5 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. స్థానిక ప్రజల అవసరాలకు ఏడాది కి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయ లు అవసరం ఉంటాయని అంచనా. నగర పరిసర ప్రాంతాలైన వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్ ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి కూర గాయలు వస్తున్నాయి. స్థానికంగా సుమారు 19 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 25 మెట్రిక్ టన్నులు వరకు కూరగాయలు అందుబాటులో ఉంటున్నా యని అంచనా వేస్తున్నారు. ఆపై అవసరాలకు ఆం ధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇతర రాష్ట్రాల కూరగాయలే దిక్కవుతున్నాయి. కూరగాయల దిగుమతికి రవాణా చార్జీలు, లోడింగ్, అన్‌లోడింగ్, మార్కెటట్ ఫీజులు, ఇతర ఖర్చులు కలిపి తడిపి మోపెడు అవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఫలితంగా నెల రోజుల క్రితం టమోటా కిలో రూ. 20 ఉంటే ప్రస్తుతం రూ. 50 చేరింది. గతంలో పచ్చిమిర్చి కిలో రూ. 60 ఉండ గా ఇప్పుడు రూ. 120కి పెరిగింది.పావు కిలో రూ. 20కి అమ్ముతున్నారు.వారపు సంతలో కూరగాయ లు ఏవి అడిగినా పావుకిలో రూ. 20 నుంచి రూ. 25 చెబుతున్నారు. నెల క్రితం వరకు కిలో టమా టా రూ. 20 ఉండేది. ప్రస్తుతం కిలో రూ. 60 అమ్ముతున్నారు. పచ్చిమిర్చి పావుకిలో రూ. 20కి దొరికేది. ప్రస్తుతం రూ. 40కి అమ్ముతున్నారు. ఇలా అన్ని ధరలు పెరగడంతో తక్కువ కూరగాయ లు కొనుగోలు చేస్తున్నారు.

మార్కెట్లో వీటి ధరల బోర్డును చూసిన జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇలా అయితే కూరగాయలు కొనేది ఎలా అంటూ వాపోతున్నారు. అసలే పన్నుల భారం, దీనికి తోడు పెట్రోల్ ధరలతో పాటు కూరగాయలు,ఆకుకూరలు కూడా వాతపెట్టడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. టమాటా,ఉల్లిగడ్డ డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధర పెరిగిపోతోందని వ్యాపారులు చెబుతున్నారు. కొత్త పంట చేతికి రావడానికి మరో రెండు నెలలు పడు తుందని అప్పటి వరకు ధర పెంపు తప్పదని మా ర్కెట్ వర్గాలు చెబుతున్నాయి.స్థానిక వ్యాపారులు ఎక్కువగా చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని కొలార్, చిక్‌మంగళూర్‌లపై ఆధారపడి అక్కడి నుం చి దిగుమతి చేసుకుంటారు. అయితే అక్కడ పంట సాగు పూర్తిగా తగ్గిపోయింది. ఇక మన రాష్ట్రంలో పంట సాగు తక్కువగా ఉంది. అది కూడా మెదక్, సిద్ధిపేట, వికారాబాద్ జిల్లాలో మాత్రమే టమాటా సాగవుతోంది. ఈ జిల్లాల నుంచి హైదరాబాద్ మార్కెట్లకు రోజుకు సుమారు 600-800 క్వింటా ళ్ల మేర టమాట వస్తుంది. అయితే ఒక్క హైదరా బాద్ దినసరి టమాటా వినియోగం సగటున 5వేల క్వింటాళ్ల నుంచి 6వేల క్వింటాళ్లు ఉంటుంది. దీంతో డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధర లు పెంచుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు తగ్గించేందుకు ప్ర భుత్వం, సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవాలంటున్నారు.

# రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు

-కంపుకొడుతున్న పట్టించుకోని జిహెచ్ఎంసి అధికారులు
-నెల రోజుల నుండి పారుతున్న వైనం



**అత్తాపూర్ మే28,ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో డ్రైనేజీ ,పరిసరాల పరిశుభ్రతకు ఎంతో కృషి చేస్తున్నామని జిహెచ్ఎంసి అధికారులు గొప్పులు చెప్పుకుంటున్నప్పటికి వాస్తా వానికి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. అరంఘర్ చౌరస్తా నుండి మోహిది పట్నం వెళ్లె మార్గంలోని పిల్లర్ నెంబర్ 251 దగ్గర గత కొన్ని రోజులుగా డ్రైనేజీ నాలా నిండి రోడ్డుపై పారుతున్న జిహెచ్ఎంసి అధికారులు పట్టిం చుకోవడం లేదు.వివిధ కాలనీల నుండి ప్రవహించే నాలా చెత్తచెదా రంతో నిండి డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాగును తలపిస్తుంది. అయిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.దీంతో రోడ్డుపై డ్రైనేజీ నీరు నిలిచిపోయి. కంపు కోడుతుండడంతో అటు వైపు ప్రయా ణాలు సాగించే వాహనదారులు ముక్కు మూసుకొని ప్రయాణం సాగిస్తు న్న పరిస్థితి నెలకొంది.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ నాలాను క్లీయర్ చేయించి డ్రైనేజీ నిరు సాఫీగా వెళ్లే విధంగా చూడాలని స్థానికు లు డిమాండ్ చేస్తున్నారు.

## బసవతారకంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

-నివాళులర్పించిన చైర్మన్ నందమూరి బాలకృష్ణ



తల్లిదండ్రులు ఎన్టీఆర్-బసవతారకం విగ్రహాలకు నివాళ్లు అర్పిస్తున్న చైర్మన్ బాలకృష్ణ

**హైదరాబాద్, మే 28,ప్రభాతవార్త:**
స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 101 జయంతిని పురస్కరించు కుని మంగళవారం బసవతారకం ఇండోఅమెరికన్ ఆసుపత్రిలో వేడుకలను ఘనం గా నిర్వహించారు. ఈకార్యక్రమానికి చైర్మన్ నందమూరి బాలకృష్ణ హాజరై హాస్పి టల్ ఆవరణలోని తమ తల్లిదండ్రుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం హాస్పిటల్‌లో క్యాన్సర్‌పై పోరాడుతూ చికిత్స పొందుతున్న చిన్నారు లకు పండ్లు, బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడు తూ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా బసవతారకం ఆసుపత్రి ముందుకు సాగుతుందన్నారు. ఎందో పేదలకు క్యాన్సర్‌పై పోరాటంలో బాసటగా నిలుస్తుం దన్నారు. తన తల్లిదండ్రులు ఆశించినట్లు అందుబాటైన ధరలలో ప్రపంచస్థాయి క్యాన్సర్ చికిత్స అందిచడంలో దేశంలోనే ముందంజలో ఉందన్నారు. ఈకార్య క్రమంలో బోర్డు సభ్యులు ఎంపి నామానాగేశ్వర్‌రావు, జెఎస్ ఆర్ ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ డా.టిఎస్‌రావు, మెడికల్ సూపరిండెంట్ డా.ఫణికోటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో గంజాయి పట్టివేత...మహిళ అరెస్ట్



పోలీసుల అదుపులో మహిళా డ్రగ్ స్మగ్లర్ షేక్ జామీన్‌బీ

**హైదరాబాద్, మే28, ప్రభాతవార్త:**
బాలానగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న మహిళను ఎస్ఎఫ్‌టీ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఏకంగా ఇంటి నుంచే ఆమె గంజాయిని సరఫరా చేస్తుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్ఎఫ్‌టీ ఎస్.ఐ బీ.బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం, షేక్ జామీన్ బీ అనే మహిళ బాలానగర్ ప్రాంతంలోని ఫతేనగర్‌లో నివాసముంటోంది. ఐతే గత కొంత కాలంగా ఆమె గుట్టు చప్పుడు కాకుండా ఇంటి నుంచే గంజాయి అమ్మకాలు కొనసాగిస్తోంది. ఒక గంజాయి ప్యాకెట్ రూ.300 కు, అంతకంటే ఎక్కువ మోతాదులో ఉన్నది రూ.500కి విక్రయిస్తోంది. మొత్తంగా కిలో గంజాయి రూ.6వేలకు పురానాపూల్ ప్రాంతం నుంచి కొనుగోలు చేసిన ఆమె, వేరు వేరు ప్యాకెట్లుగా గంజాయిని విడదీసి కిలో రూ.10వేలకు తగ్గకుండా విక్రయిస్తోంది. ఈ మేరకు నిందితురాలు పోలీసుల దర్యాప్తులో చెప్పింది. విశ్వనీయ సమాచారం అందడం తో గంజాయి విక్రయిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి, సీజ్ చేసిన గంజాయితో పాటు నిందితురాలిని న్యాయ మూర్తి ముందు హాజరు పరిచి రిమాండుకు తరలించారు.

## ఉరివేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

**శేరిలింగంపల్లి, మే 28 ప్రభాతవార్త :** మానసిక ఒత్తిడి,తీవ్రమనోవేదనతో బాధప డుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తాను నివాసముంటున్న ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గత కొన్నేళ్లుగా తీవ్ర మనోవేదనతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. సంఘటనకు సంబందించి గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ఠటం ఘజియాబాద్ జిల్లా శిల్పాసన్ సిటీలో నివాసముండే జయప్రకాశ్ పలివాల్ కుమార్తె నీతూ పలివాల్(42) నగరంలోని విప్రో సంస్థలో ఐటీ ఉద్యోగినిగా పనిచేస్తూ గచ్చిబౌలిలోని టీఎన్జీవో కాలనీలో నివాసముంటున్నారు కాగా గత మూడు సంవత్సరాలుగా తీవ్ర మనోవే దనతో బాధపడుతన్న నీతూ చికికత్సను కూడా తీసుకుంటుంది. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి 9:30గంటల ప్రాంతంలో నీతూ తాను నివాసమంటున్న ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా నగరంలోనే నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ, మియాపూర్‌లో నివాసముం టున్న నీతూ సోదరుడు సాయి సురభ పలివాల్ తన సోదరికి ఫోన్ చేయగా ఎంతకూ స్పందించలేదు. దీంతో నీతూ నివాసం ఉంటున్న ఇంటికి వెళ్లగా నీతూ ఇంటి తలుపులు గడియవేసి ఉంది. ఇంటి యజమానులను పిలిచి తలుపులు బద్దలు కొట్టి చూడగా నీతూ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండటం కనిపించింది. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందిం చగా పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా నీతూకు వివాహం జరుగకపోవడం,మానసిక వ్యాధితో బాధపడుతుండటమే ఆమె ఆత్మహత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

**బేగంపేట మే 28,ప్రభాతవార్త**
తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పగలు చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను ఎస్సార్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసారు.నిందితుడి నుంచి 2లక్షల రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈసం ఘటనపై ఎస్సార్ నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాధ్ రెడ్డి,డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ జానకి రాములు వివరాలను తెలియజేసారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడిపత్రి సమీపంలో ని శ్రీరాములు పేటకు చెందిన వాయులు వారి బాలగోవింద్(22),ఉదయం సమయంలో వీధులలో తిరుగుతూ చెత్త ,చిత్తు కాగితాలు ఏరుకుంటున్నట్లు ఉంటూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తిస్తాడు.రాత్రి పూట ఆ ఇళ్లను టార్గెట్ చేసి ఇంటి తాళాలు పగుల గొట్టి చోరీలకు పాల్పడేవాడు.గత సంవత్సరం తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు చోట్ల చోరీలకు పాల్పడి బంగా రు,వెండి,ఆభరణాలు,నగదు చోరీ చేసాడు.అక్కడి నుంచి రెండు నెలల క్రితం నగరానికి వచ్చి దాసారం బస్తీలో నివాసం ఉంటున్నాడు.ఈ సంవత్సరం ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డా డు.చోరీ చేసిన సొత్తును దాసారం బస్తీ గుడిసెల్లోనే ఉంటున్న పి.సుంకప్ప (36),పి.సురేందర్(25)లకు అప్పగిస్తుంటాడు.వారు చోరీ సొత్తును అమ్మిసొ మ్ము చేస్తుంటారు.కొంత చోరీ సొత్తును సనత్‌నగర్ లో పాన్ బ్రోకర్ వ్యాపారం చేస్తున్న అశోక్‌కుమార్ జైన్ వద్ద తాకట్టు పెట్టారు.ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి దర్యాప్తు జరుపుతున్న ఎస్సార్‌నగర్ క్రైం పోలీసు బృందం విశ్వసనీయ సమాచారం మేరకు బాలగోవింద్‌తో పాటు సుంకప్ప,సురేందర్‌లను దాసారం బస్తీలో అరెస్ట్ చేసారు.చోరీ సొత్తు తాకట్టు పెట్టుకున్న అశోక్ కుమార్ జైన్ ను కూడా పోలీసులు అరెస్ట్ చేసారు.నిందితుల నుంచి రూ 2లక్షల విలువ చేసే 30వతులాల వెండి వస్తువులు,2తులాల బం గారు ఆభరణాలు,రూ 2వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

